పాముల పార్కు..!

- సర్పాలకు నిలయంగా జీవీఎంసీ పార్కు
- నిర్వహణను గాలికొదిలేయడంతో యథేచ్ఛగా సంచారం
- భయాందోళనలో వాకర్స్, సందర్శకులు


తుప్పు పట్టిన పిల్లల ఆట పరికరాలు


హైవేపై డెయిరీఫారం వద్ద పాములకు ఆవాసమైన జీవీఎంసీ పార్కు

ఆరిలోవ: పాత డెయిరీఫారం వద్ద జాతీయ రహదారి పక్కన జీవీఎంసీ నిర్మించిన ఓ పార్కు పాములకు నిలయంగా మారింది. ప్రజలు సేదతీరాల్సిన పార్కులో సర్పాలు యథేచ్ఛగా సంచరిస్తున్నాయి. ఇక్కడ పిల్లలు ఆటలాడుకోవడానికి జీవీఎంసీ వివిధ పరికరాలు ఏర్పాటు చేసింది. పెద్దలు ఉదయం, సాయంత్రం నడక కోసం అనువుగా పాత్‌వేలు నిర్మించింది. ఈ పార్కును నిర్మించి.. నిర్వహణను గాలికొదిలేయడంతో పిచ్చి మొక్కలు దట్టంగా పెరిగాయి. దీంతో స్థానికులు ఈ పార్కును వినియోగించడం లేదు. నిర్వహణ


పార్కు పరిసరాలు, పాత్‌వేపై దట్టమైన పిచ్చి మొక్కలు

లేకపోవడం వల్ల పార్కు లోపల ఖాళీ స్థలాలతో పాటు పాత్‌వేలపై సైతం పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగాయి. ఇక్కడ ఏర్పాటు చేసిన ఆట పరికరాలు తుప్పు పట్టిపోతున్నాయి. స్థానికులెవ్వరూ వినియోగించని ఈ పార్కును పాములు ఆవాసంగా మార్చుకున్నాయి.

కొండచిలువ కలకలం..

మూడు రోజుల కిందట ఇక్కడ ఓ కొండచిలువ కలకలం రేపిన విషయం తెలిసిందే. ఈ పార్కులో ఓ పక్కన జీవీఎంసీ నీటి సరఫరా విభాగానికి చెందిన పంప్ హౌస్ ఉంది. దీని నుంచి సిబ్బంది రోజూ విశాలాక్షినగర్, డెయిరీఫారం, ఆదర్శనగర్, హనుమంతవాక వైపు నీరు సరఫరా చేస్తుంటారు. ఈ క్రమంలో పంప్ హౌస్‌లో నీటి ట్యాప్ విప్పడానికి వెళ్లిన సిబ్బందికి సుమారు 12 అడుగుల కొండచిలువ కనిపించింది. భయంతో వారు పరుగులు తీశారు. వెంటనే స్నేక్ క్యాచర్ కిరణ్‌కు సమాచారమిచ్చి దాన్ని పట్టుకొని అడవిలో విడిచిపెట్టారు.

హడలిపోతున్న సందర్శకులు

ఈ పార్కు ఎదురుగా ఏసీబీ రీజినల్ ఆఫీస్, దీనికి సమీపంలో ప్రభుత్వ ఎస్సీ బాయ్స్ హాస్టల్, డీఈవో కార్యాలయం, రూరల్ తహసీల్దార్ కార్యాలయం ఉన్నాయి. వాటికి వివిధ పనుల నిమిత్తం వెళ్లేవారు ఈ పార్కులో సేద తీరేందుకు భయపడిపోతున్నారు. ఇక్కడ తరచూ పాములు కనిపిస్తున్నాయని కార్యాలయాల సిబ్బంది అంటున్నారు. పార్కులో ఆవాసం ఏర్పాటు చేసుకున్న సర్పాలు కార్యాలయాల్లోకి చేరి భయభ్రాంతులకు గురి చేస్తున్నాయని చెబుతున్నారు. ఇక్కడ కొండచిలువ కలకలం సృష్టించడంతో అధికారులు, సిబ్బంది మరింత భయపడుతున్నారు. ఈ పార్కులో పిచ్చి మొక్కలను తొలగించి, వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు, సందర్శకులు కోరుతున్నారు.


స్నేక్ క్యాచర్ పట్టుకున్న కొండచిలువ(ఫైల్)

నేటి నుంచి చండీ సహిత సుదర్శన యాగం

ఎర్నిదుర్గమాంబ ఆలయంలో ఐదు రోజులపాటు నిర్వహణ

ఆరిలోవ: లోక కల్యాణం కోసం బుధవారం నుంచి ఐదు రోజులు పాటు చండీ సహిత సుదర్శన యాగం నిర్వహించనున్నట్లు బాలభాను అర్చక, పురోహిత సంఘం అధ్యక్షుడు జోస్యుల కామేశ్వర శర్మ తెలిపారు. తోటగరువు ఎర్నిదుర్గమాంబ ఆలయంలో సంఘం ప్రతినిధులు మంగళవారం నిర్వహించిన సమావేశంలో యాగానికి సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తోటగరువు ఎర్నిదుర్గమాంబ ఆలయ ప్రాంగణంలో ఈ నెల 18 నుంచి 22 వరకు యాగం జరుగుతుందన్నారు. ప్రతిరోజు విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, గోపూజ, తులసీ ఆరాధన, సూర్య నమస్కారాలు, చండీ పారాయణం, చండీ హోమం, రుద్రాభిషేకం నిర్వహించనున్నట్లు తెలిపారు. వీటితో పాటు ప్రతి రోజు రాత్రి 7 గంటల నుంచి స్వామి వార్ల కల్యాణమహోత్సవాలు జరిపిస్తామన్నారు. అందులో భాగంగా 18న సీతారామ కల్యాణం, 19న వల్లి దేవసేన సహిత సుబ్రహ్మణ్య స్వామి కల్యాణం, 20న శివపార్వతుల కల్యాణం,


పోస్టర్ ఆవిష్కరిస్తున్న బాలభాను అర్చక సంఘం ప్రతినిధులు

21న శ్రీనివాస కల్యాణం, 22న ఆదివారం సూర్యనారాయణ స్వామి కల్యాణం జరిపించనున్నట్లు తెలిపారు. సంఘం కార్యదర్శి మావుదూరు కిశోర్ శర్మ మాట్లాడుతూ భక్తులను భాగస్వాములను చేసే ఈ యాగంలో కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడుతో పాటు పలువురు రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలను ఆహ్వానించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు గౌరవాధ్యక్షుడు ఆరవెల్లి సూర్యప్రకాశరావు, కోశాధికారి పి.సుబ్రహ్మణ్యం, ఉపాధ్యక్షులు ఎం.కృష్ణమూర్తి శర్మ, ఎం.సంపత్ కుమార్ శర్మ, కన్యకాపరమేశ్వరి ఆలయ ప్రధాన అర్చకుడు కుమార్ శర్మ పాల్గొన్నారు.

నూతన బోధనా పద్ధతులతో విద్యార్థుల్లో ఆసక్తి

ఆరిలోవ: పాఠశాలల్లో విద్యార్థులకు ఉపాధ్యాయులు కష్టపడి బోధించాలని చినగదిలి మండలం ఎంఈవో రవీంద్రబాబు తెలిపారు. బోధనలో కొత్త పద్ధతులను అవలంబిస్తే, విద్యార్థులు ఆసక్తిగా వింటారన్నారు. చినగదిలి మండల పరిధిలోని ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. కొత్త బోధనా పద్ధతుల గురించి వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు కష్టపడి బోధిస్తే ప్రైవేట్ పాఠశాలలు నుంచి విద్యార్థులు వచ్చి చేరుతారన్నారు. నూతన బోధనా పద్ధతులు గురించి ఉపాధ్యాయులంతా తెలుసుకోవాలన్నారు. సమావేశంలో చినగదిలి మండలంలోని తోటగరువు హైస్కూల్, అడవివరం హైస్కూల్ పరిధిలో ఉన్న పాఠశాలల ఉపాధ్యాయులు, స్కూల్ కాంప్లెక్స్ సెక్రటరీ విశ్వనాథం, సీఆర్పీ ఎం.అప్పలరాజు, ఆర్పీలు పాల్గొన్నారు.


స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో రవీంద్రబాబు

క్లుప్తంగా

దేశాభివృద్ధిలో హిందీ కీలకం

ఎంవీపీ కాలనీ: ఎంవీపీ కాలనీ గాయత్రి విద్యా పరిషత్‌లో హిందీ దివస్‌ను మంగళవారం ఘనంగా నిర్వహించారు. కళాశాల సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో స్టీల్ ప్లాంట్ మేనేజింగ్ రిజిస్ట్రార్ డాక్టర్ లలన్‌కుమార్ మాట్లాడుతూ దేశాభివృద్ధిలో హిందీ భాష కీలకమన్నారు. భవిష్యత్ అవసరాలకు, అవకాశాలకు అనుగుణంగా ప్రతి విద్యార్థి హిందీలో ప్రావీణ్యం సాధించాలని సూచించారు. ప్రపంచ వ్యాప్తంగా కూడా హిందీ మాట్లాడే వారి సంఖ్య పెరిగేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో గాయత్రి విద్యా పరిషత్ ఇన్‌ఛార్జి డైరెక్టర్ గిరిధర్, సభ్యుడు ప్రగడ రాజగణపతి తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్స్ తనిఖీ చేసిన ఏయూ రెక్టార్


హాస్టల్‌లో భోజనం రుచి చూస్తున్న ఏయూ రెక్టార్ కిషోర్‌బాబు

విశాఖ సిటీ: ఆంధ్రా యూనివర్సిటీలో విద్యార్థినుల హాస్టల్స్‌ను రెక్టార్ ప్రొఫెసర్ ఎన్.కిషోర్‌బాబు మంగళవారం రాత్రి తనిఖీ చేశారు. సీతామహల్‌తోపాటు మహారాణిపేటలో ఉన్న హాస్టల్స్‌కు వెళ్లి అక్కడి పరిస్థితులను గమనించారు. క్యాంటీన్‌లో భోజనం ఎలా ఉందన్న విషయాన్ని విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన స్వయంగా తిని రుచి చూశారు. తనిఖీల్లో చీఫ్ వార్డెన్లు, సెక్యూరిటీ డీన్‌లు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



ఆరిలోవ: ఆరిలోవ పోలీస్ స్టేషన్ పరిధిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం బయటపడింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ... జీవీఎంసీ పదో వార్డు పరిధి పాత డెయిరీ ఫారం వద్ద ఓ బార్ అండ్ రెస్టారెంట్ పక్కన కాలువ గట్టుపై గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం ఉన్నట్లు స్థానికులు పోలీసులకు తెలిపారు. మృతదేహం వద్ద ఎలాంటి ఆధారం లభించకపోవడంతో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు కేసు నమోదు చేశారు. మృతుని వయసు 50 నుంచి 55 సంవత్సరాల మధ్య ఉంటుందని భావిస్తున్నారు. మృతదేహాన్ని కేజీహెచ్ మార్చురీకి తరలించారు.

రామారావుపై సస్పెన్షన్ ఎత్తివేయాలి


ధర్నాలో నిరసన తెలుపుతున్న ప్రజా రవాణాశాఖ ఉద్యోగులు

మద్దిలపాలెం: వాల్తేరు డిపోలో సస్పెండ్ అయిన కండక్టర్ రామారావుకి సంఘీభావంగా మద్దిలపాలెం డిపో వద్ద మంగళవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ డిపో జోనల్ జాయింట్ సెక్రటరీ సీహెచ్ ఈశ్వరరావు మాట్లాడుతూ వాల్తేరు డిపో మేనేజర్ సుధాకర్ మొండి వైఖరి విడనాడాలన్నారు. కండక్టర్ రామారావు మీద సస్పెన్షన్ వెంటనే ఎత్తివేయాలని కోరారు. అన్ని డిపోల్లోనూ గ్యారేజీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మద్దిలపాలెం డిపో అధ్యక్షుడు ఎం.ఈశ్వరరావు మాట్లాడుతూ వాల్తేరు డిపోలో సస్పెండ్ అయిన కండక్టర్ రామారావుకు సంఘీభావంగా ధర్నా నిర్వహిచామన్నారు. కార్యక్రమంలో బంగారయ్య, ఈశ్వరరావు, సీహెచ్‌ఎస్ రాజు, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

గెడ్డ స్థలాలు ఆక్రమించకుండా చర్యలు


డ్రైవర్స్ కాలనీలో గెడ్డ అంచున ఖాళీ స్థలం


మేయర్ హరివెంకటకుమారి

సాక్షి ఎఫెక్ట్..

ఆరిలోవ: గెడ్డ స్థలాలు ఆక్రమణకు గురికాకుండా రక్షణ కల్పిస్తామని నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి తెలిపారు. ఆరిలోవ ప్రాంతంలో గెడ్డలు ఆక్రమణకు గురవుతున్నాయి. దీంతో విశాలంగా ఉండే గెడ్డలు కాలువలుగా మారిపోతున్నాయి. ముఖ్యంగా కొందరు గెడ్డ అంచున ఖాళీ స్థలాలు ఆక్రమించి దొంగ పట్టాలు సృష్టించి విక్రయాలకు సిద్ధమవుతున్నారు. దీనిపై 'దర్జాగా కబ్జా' శీర్షికతో సాక్షిలో మంగళవారం ప్రచురించిన కథనానికి నగర మేయర్ హరివెంకటకుమారి, జీవీఎంసీ టౌన్ ప్లానింగ్, రెవెన్యూ అధికారులు స్పందించారు. తోటగరువు, గాంధీనగర్, శ్రీహరినగర్ తదితర ప్రాంతాల్లో ఆక్రమణకు గురైన గెడ్డలను సిబ్బంది పరిశీలించారు. ఈ సందర్భంగా నగర మేయర్ 'సాక్షి'తో మాట్లాడుతూ డ్రైవర్స్ కాలనీలో గెడ్డ అంచున ఉన్న స్థలంలో సామాజిక భవనం నిర్మించడానికి కొద్ది రోజుల క్రితమే ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. జీవీఎంసీ అధికారులు ఆ స్థలంలో సామాజిక భవనం నిర్మాణం కోసం అంచనాలు కూడా రూపొందించారని తెలిపారు. త్వరలో అక్కడ నిర్మాణ పనులు ప్రారంభిస్తామన్నారు. ఆ స్థలాన్ని ఎవరూ ఆక్రమించడానికి వీలుపడదన్నారు. దానికి సంబంధించిన దొంగ పట్టాలు బయటపడితే చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు. పెదగదిలి గెడ్డ అంచున ఆక్రమణపై కూడా పశుసంవర్ధక శాఖ అధికారులు దృష్టి సారించి చర్యలు తీసుకోవాలన్నారు. ఏ ప్రాంతంలోనూ గెడ్డ స్థలాలు ఆక్రమించకుండా అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ


కృష్ణా కళాశాలలో విద్యార్థికి ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న ప్రిన్సిపాల్ విజయబాబు


అంగన్‌వాడీ చిన్నారులకు మాత్రలు వేస్తున్న ఆరోగ్య సిబ్బంది

మద్దిలపాలెం: నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా డాక్టర్ వి.ఎస్.కృష్ణా కళాశాలలో విద్యార్థులకు మంగళవారం ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు మాట్లాడుతూ నులిపురుగుల కారణంగా విద్యార్థులు తరచూ అస్వస్థతకు గురవుతారన్నారు. ఆరు నెలలకు ఒకసారి ఈ మాత్రలు మింగించడం వల్ల నులిపురుగులు పోయి, పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని చెప్పారు. కార్యక్రమంలో జాతీయ సేవా పథకం అధికారులు పోలా ఉమామహేశ్వరరావు, జి.వి ప్రతాప్, శామ్యూల్ డేవిడ్ రాజ్, బి.లక్ష్మి, యూబీఐ కో–ఆర్డినేటర్ ఎస్.వి.రామారావు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో..

మద్దిలపాలెం: ఇసుకతోట అంబేడ్కర్ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు నులిపురుగు నివారణ మాత్రలు పంపిణీ చేశారు. వెంకోజీపాలెం పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో చిన్నారులకు ఈ మాత్రలను దగ్గరుండి వేయించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ ఈర్ల దేవి, పట్టణ ఆరోగ్య కేంద్రం ఏఎన్‌ఎం, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

వాడవాడలా అన్న సమారాధనలు


గాంధీ నగర్‌లో భక్తులకు భోజనాలు వడ్డిస్తున్న మేయర్ హరి వెంకటకుమారి


28వ వార్డులో భక్తులకు అన్నప్రసాదం వడ్డిస్తున్న పల్లా దుర్గారావు


22వ వార్డులో భక్తులకు వడ్డిస్తున్న పీతల గోవింద్

ఆరిలోవ: గణపతి నవరాత్రి మహోత్సవాల సందర్భంగా నియోజకవర్గ పరిధిలో ఏర్పాటు చేసిన పలు మండపాల వద్ద మంగళవారం అన్నసమారాధనలు నిర్వహించారు. పదకొండో వార్డు పరిధి గాంధీనగర్‌లో జరిగిన అన్నసమారాధనలో నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి పాల్గొని, భక్తులకు భోజనాలు వడ్డించారు. పరిసర ప్రాంతాల భక్తులు అధిక సంఖ్యలో వచ్చి అన్నప్రసాదం స్వీకరించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

- పదమూడో వార్డు పరిధి ఆరిలోవ కాలనీలోని వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో విశ్వకర్మ జయంతి ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా నగర మేయర్ హరి వెంకటకుమారి పాల్గొని స్వామికి పూజలు చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఏర్పాటు చేసిన అన్నసమారాధనలో మేయర్ పాల్గొని, భక్తులు భోజనాలు వడ్డించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు పాల్గొన్నారు.

28వ వార్డు రామ్‌నగర్‌లో..

బీచ్‌రోడ్డు: జీవీఎంసీ 28వ వార్డు పరిధి రామ్‌నగర్ బజార్‌లో ఆర్‌ఎన్ క్రాక్ బాయ్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం అన్న సమారాధన నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి పల్లా దుర్గారావు అన్న సమారాధన ప్రారంభించారు. కార్యక్రమంలో మార్గాన వెంకటేష్, ఆల్సి అప్పల నారాయణ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

- 22వ వార్డు పీతవానిపాలెంలో ఆల్ఫా బుల్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్న సమారాధనను వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు పీతల గోవింద్ ప్రారంభించారు. భక్తులకు అన్న ప్రసాదం వడ్డించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు అశోక్, మధు, గోపీ, టింకూ తదితరులు పాల్గొన్నారు.

ఎంవీపీకాలనీ: 18వ వార్డు ఎంవీపీ కాలనీ సెక్టార్–9లో మహా అన్నసమారాధన నిర్వహించారు. జాగ్వార్ బాయ్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాన్ని మాజీ ఎంపీ, వైఎస్సార్‌సీపీ నాయకుడు ఎంవీవీ సత్యనారాయణ ప్రారంభించారు. తొలుత వినాయకుడికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా సోమవారం ఎంవీవీ జన్మదినాన్ని పురస్కరించుకుని యువత మరోసారి ఆయనతో కేక్ కట్ చేయించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు కల్యాణ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.


18వ వార్డులో భక్తులకు అన్నప్రసాదం వడ్డిస్తున్న మాజీ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ

ఎడ్ల బండిపై గణపతి ఊరేగింపు


ఎడ్ల బండిపై గణపతి విగ్రహాన్ని ఊరేగిస్తున్న పీతల గోవింద్

బీచ్‌రోడ్డు: వినాయక చవితి సందర్భంగా విభిన్న రూపాల్లో వినాయక విగ్రహాలు ఏర్పాటు చేయడం మనం చూస్తాం... మండపాలను కూడా డిఫారెంట్‌గా సిద్ధం చేయడం చూస్తాం.. కానీ నగరంలో గణపతిని ఎడ్ల బండిపై ఊరేగిస్తే సూపర్ కదా... జీవీఎంసీ 22వ వార్డులోని పీతలవానిపాలెంలో శ్రీకృష్ణ యువజన సంఘం ఆధ్వర్యంలో కృష్ణుడు రూపంలోని వినాయకుడిని ఎడ్ల బండిపై ఎక్కించి సోమవారం రాత్రి ఊరేగించారు. కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు పీతల గోవింద్ ప్రారంభించారు. అనంతరం గణేషుడిని సముద్రంలో నిమజ్జనం చేశారు.

రాష్ట్రాభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి

స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు

ఎంవీపీ కాలనీ: రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో కూటమి పార్టీల విజయాన్ని పురస్కరించుకొని టీడీపీ పార్లమెంట్ జిల్లా ఉపాధ్యక్షుడు పోతన్నరెడ్డి ఆధ్వర్యంలో ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబుతో కలిసి స్థానిక కరకచెట్టు పోలమాంబ ఆలయంలో మంగళవారం మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం అయ్యన్నపాత్రుడు మీడియాతో మాట్లాడుతూ మాజీ సీఎం జగన్ అసెంబ్లీకి రావాలని తాను స్వయంగా కోరినట్లు తెలిపారు. సభకు రావాల్సిన బాధ్యత ఆయనపై ఉందన్నారు. ఆయనకు సభలో మాట్లాడే అవకాశం కల్పించాల్సిన బాధ్యత తనపై ఉందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పట్టాభిరామ్, బొట్టా రమణ, పీతల అమరేంద్ర, కాళ్ల శంకర్, ధన్‌రెడ్డి, జ్యోతి, సాయి బలరామ్, దేముడు, డొక్కర శ్రీను తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

బీజేపీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

ఎంవీపీకాలనీ: ప్రధానమంత్రి నరేంద్రమోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని నగర బీజేపీ శ్రేణులు రక్తదాన శిబిరం నిర్వహించాయి. లాసన్స్ బే కాలనీలోని పార్టీ కార్యాలయంలో పార్టీ అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిబిరాన్ని పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, విశాఖ ఉత్తర ఎమ్మెల్యే విష్ణు కుమార్‌రాజు ప్రారంభించారు. శిబిరంలో పార్టీ శ్రేణులు, యువకులు పెద్ద ఎత్తున రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ పాలనలో రాష్ట్ర ప్రజలకు ఎంతో మేలు జరుగుతోందన్నారు. కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.


రక్తదానం చేస్తున్న యువకులు

వాల్తేర్ డివిజన్‌లో స్వచ్ఛతా హీ సేవ ప్రారంభం

తాటిచెట్లపాలెం : వాల్తేర్ డివిజన్ పరిధిలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని డీఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ సూచనల మేరకు సెప్టెంబరు 17 నుంచి అక్టోబర్ 2 వరకు పక్షోత్సవాలు నిర్వహిస్తామని తెలిపారు. ఇందులో భాగంగా వాల్తేర్ డివిజన్ పరిధిలో గల స్టేషన్లు, రైల్వే కాలనీలు, ప్రాంగణాల వద్ద పరిశుభ్రత కార్యక్రమాలు, డీఆర్‌ఎం కార్యాలయం వద్ద స్వచ్ఛతా ప్రతిజ్ఞ చేపట్టారు. కార్యక్రమంలో ఏడీఆర్‌ఎంలు మనోజ్‌కుమార్ సాహు (ఆపరేషన్స్), సుధీర్‌కుమార్ గుప్తా (ఇన్‌ఫ్రా), సీనియర్ డివిజినల్ మెకానికల్ ఇంజినీర్, ఎన్విరాన్‌మెంట్ హెడ్ ప్రవీణ్‌భట్, డివిజినల్ మెకానికల్ ఇంజినీర్ నరేంద్రకుమార్, ఇతర అధికారులు, సిబ్బంది పల్గొన్నారు.


అధికారులు, సిబ్బందితో స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయిస్తున్న డీఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్

సీఎం సహాయ నిధికి ఏయూ రిటైర్డ్ టీచర్స్ విరాళం

విశాఖ సిటీ: విజయవాడ వరద బాధితుల సహాయార్థం ఆంధ్ర విశ్వవిద్యాలయం రిటైర్డ్ టీచర్స్ మ్యూచువల్ ఎయిడెడ్ కో–ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ సభ్యులు సీఎం సహాయ నిధికి రూ.1,01,116 విరాళం అందించారు. ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయ రావును కలిసి చెక్కు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆచార్య ఎల్.డి.సుధాకర్‌బాబు, ఆచార్య కైలాసరెడ్డి, ఆచార్య జి.వి.వి.జయకుమార్, సునీత తదితరులు పాల్గొన్నారు.


రిజిస్ట్రార్ ధనుంజయరావుకు చెక్కు అందజేస్తున్న ఏయూ రిటైర్డ్ టీచర్లు

ఘనంగా పెరియార్ జయంతి

బీచ్‌రోడ్డు: నాస్తిక వాది, సంఘ సంస్కర్త పెరియార్ ఇ.వి.రామస్వామి గొప్ప ఆదర్శవాది అని భారత నాస్తిక సమాజం నాయకుడు తుంపాల్ల శ్రీరామ్మూర్తి, సీపీఐ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు అన్నారు. పెరియార్ జయంతి సందర్భంగా మంగళవారం బీచ్‌రోడ్డులోని ఆయన విగ్రహానికి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలను చైతన్యవంతులను చేసేందుకు పెరియార్ కృషి చేశారన్నారు. రవి, సునీత, నూకరాజు, రాంప్రభు, సీఎస్ క్షేత్రపాల్, విజ్ఞానంద్, ఎన్ నాగభూషణం, ఎ.ఆదినారాయణ, సీహెచ్ కాసుబాబు, టీఎస్ సుకుమారన్ తదితరులు పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న ప్రముఖులు

భారతీయ మేధోశక్తి ప్రపంచానికి దిక్సూచి

బీచ్ రోడ్: ప్రపంచ దేశాలన్నీ భారతీయ మేధాశక్తిపై ఆధారపడుతున్నాయని రిక్రూట్‌మెంట్ ఎంట్రప్రెన్యూర్ సంస్థ వ్యవస్థాపకుడు జేమ్స్ అన్నారు. నోవాటెల్‌లో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ భారత్‌లో వ్యాపార అవకాశాలు విస్తృతంగా ఉన్నాయన్నారు. భారత్‌లో 50 మంది ఔత్సాహికులు, కంపెనీలు తమ సంస్థలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చారన్నారు. పార్టనర్, టెక్ విషన్ సంస్థ అధినేత రాజీవ్ సెంట మాట్లాడుతూ కొత్త సంస్థలకు శిక్షణ, హెచ్‌ఆర్, లీగల్ అంశాల్లో మద్దతు ఇస్తామన్నారు. ఆశిష్, జెస్ పాల్గొన్నారు.